క్లుప్తంగా

లక్ష్య సాధనకు కష్ట పడండి

బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



మమతను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

కేశంపేట: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, లక్ష్య సాధనకు కష్టపడి చదవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు సొంటె శ్రీనివాస్ అన్నారు. బోధునంపల్లి గ్రామంలో నిరుపేద లైన రోశయ్య, లక్ష్మమ్మల కుమార్తె మమత కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈ సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో ఆమెను శనివారం సన్మానించారు. అనంతరం సొంటె శ్రీనివాస్ మాట్లాడుతూ యువత ఉన్నతమార్గాలను ఎంచుకొని కష్టపడి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి గోపని భీమయ్య, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ ధరించండి



హెల్మెట్లను పంపిణీ చేస్తున్న నరేందర్‌రెడ్డి

కేశంపేట: ప్రాణ రక్షణకు హెల్మెట్ ధరించాలని బీజేపీ సాంస్కృతికశాఖ జిల్లా కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. సంతాపూర్ గ్రామంలో శనివారం పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు తమ వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కూడా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహ, మచ్చేందర్, శ్రీను, శివరెడ్డి, విజయ్, వెంకటేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

మొయినాబాద్ ఎస్‌ఐ రామచంద్ర

మొయినాబాద్: వృత్తి విద్యలో విద్యార్థులు సరైన నైపుణ్యం సాధిస్తే బాగా రాణిస్తారని మొయినాబాద్ ఎస్‌ఐ రామచంద్ర అన్నారు. మొయినాబాద్ మండలంలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఎంబీఏ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంబీఏ కోర్సులో మంచి నైపుణ్యం సాధిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎంబీఏతో మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల డీన్ డాక్టర్ నసర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కానిస్టేబుల్ శ్రావణ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కాంచనలత



బాధ్యతలు స్వీకరించిన కాంచన లతను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కాంచనలత బాధ్యతలు స్వీకరించారు. శనివారం ప్రిన్సిపాల్ కాంచనలతను కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. బేగంపేట్ మహిళా కళాశాలలో అసోషియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆమెకు పదోన్నతి లభించటంతో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చినట్లు తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి

జిమ్స్ కళాశాల ప్రొఫెసర్ విరాజ్‌కుమార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కొత్తూరు: విద్యార్థులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని జిమ్స్ హోమియోపతి కళాశాల ప్రొఫెసర్ విరాజ్‌కుమార్ అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా శనివారం సిద్ధాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పౌష్టికాహారం తీసుకోకుంటే చిన్నారులు, విద్యార్థుల్లో శారీరక ఎదుగుదల ఉండదన్నారు. ఈ ఏడాది జులై నుంచి గ్రామాల్లో ప్రతీ శనివారం కళాశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి కీళ్ల నొప్పులు, మధుమేహం, కిడ్నీ, మహిళల సమస్యలకు సంబంధించిన వాటికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యథేచ్ఛగా లెడ్ బట్టీలు



జంగోనిగూడలో రాత్రి పూట ఏర్పాటు చేసిన బట్టీ

- ఇబ్బందుల్లో జనం
- పెరుగుతున్న వాయుకాలుష్యం
- పట్టించుకోని అధికారులు

నందిగామ: పచ్చని పంట పొలాల్లో కాలుష్యం చిచ్చు పెరిగిపోతుంది. ఒకవైపు పరిశ్రమలతో కాలుష్యం వెలువడడమే కాకుండా మరోవైపు అర్ధ రాత్రయితే చాలు బగబగ మండె లెడ్ బట్టీలతో కాలుష్యం పెరుగుతుంది. వెరసి మండల ప్రజలు వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ విషయంలో నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పుట్ట గొడుగుల్లా లెడ్ బట్టీలు వెలుస్తున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు.

ఎక్కడెక్కడంటే..

◆ మండల కేంద్రమైన నందిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని జంగోనిగూడ ఈ బట్టీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

◆ జంగోనిగూడ నుంచి తీగాపూర్‌కు వెళ్లే రహదారిలో మూడు లెడ్ బట్టీలను ఏర్పాటు చేశారు. అవి రాత్రయితే చాలు బగబగ వెలుగుతూనే ఉంటాయి.



నిల్వ ఉన్న బ్యాటరీలు

◆ జంగోనిగూడ సమీపంలోని పిత్తి ల్యామినేషన్ పరిశ్రమ సమీపంలో ఓ చోట అక్రమంగా కొనసాగిస్తున్నారు.

◆ నందిగామ నుంచి చేగూరుకు వెళ్లే నక్షా బాటలో ఓ వెంచర్ సమీపంలో గత కొంత కాలంగా వాటిని నిర్వహిస్తున్నారు.

◆ అయ్యప్ప స్వామీ దేవాలయం సమీపంలో పారిశ్రామిక వాడలో పదుల సంఖ్యలో అక్రమ బట్టీలు నడిపిస్తున్నారు.

పెరుగుతున్న కాలుష్యం..

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కేవలం రాత్రి వేళల్లోనే వీటిని నిర్వహిస్తుంటారు. పాడైపోయిన బ్యాటరీలను పగులగొట్టి అందులోని మెటీరియల్ సేకరించి బొగ్గుతో కాల్చి కరగబెట్టి లెడ్‌ను వెలికి తీస్తారు. ఈ ప్రక్రియలో బ్యాటరీలను బొగ్గుతో కాల్చినప్పుడు విపరీతమైన నల్లటి పొగ, దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పొగతో సమీపంలోని గ్రామాలు, వ్యవసాయ పంటపొలాలు కాలుష్యకారకానికి బలౌతున్నాయి.

రాత్రి వేళల్లోనే కొనసాగింపు..

ఈ అక్రమ లెడ్ బట్టీలను నిర్వాహకులు రాత్రి తొమ్మిది గంటల నుంచి తెల్లవారు జామున 5 గంటల వరకు పనులు చేయిస్తుంటారు. లెడ్ బట్టీలలో పనిచేసే కార్మికులకు ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. జంగోనిగూడ శివారులోని ఓ లెడ్ బట్టిలో గతంలో జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. రాత్రి వేళల్లో మాత్రమే కొనసాగుతున్న లెడ్ బట్టీలలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకొని పేద కార్మికులు బలౌతున్న పట్టించుకునే అధికారులు లేరు. ప్రమాదం సంభవించినప్పుడు గుట్టుచప్పుడు కాకుండా క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించిన సంఘటనలూ కూడా లేకపోలేదు.

అక్రమంగా విద్యుత్ వాడకం..

లెడ్ బట్టీల నిర్వాహకులు తమ బట్టీలకు రాత్రి వేళల్లో చేపట్టడం వల్ల విద్యుత్‌ను అక్రమంగా వాడుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగలు ఎవరికీ అనుమానం రాకుండా ఉండి, రాత్రయితే చాలు విద్యుత్ తీగలకు కొక్కిలు తగిలించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని సమాచారం. ఈ విషయంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమంగా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ బట్టీలపై తగు చర్యలుతీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు..

ఈ విషయమై విద్యుత్ ఏఈ శ్రీధర్‌ను వివరణ కోరగా లెడ్డు బట్టీలకు అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నారనే విషయం తమ దృష్టికి రాలేదన్నారు. మాకు తెలిసినంత వరకు అలాంటిదేమి లేదని, విద్యుత్‌ను వాడుకోవాలంటే తప్పకుడా మీటర్లను బిగించుకోవాలని, లేనట్లయితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. – శ్రీధర్, ఏఈ

కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాం..



గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన లెడ్డు బట్టీలు రాత్రి 10 గంటల దాటిందంటే చాలు గ్రామంలో నల్లటి పొగ వ్యాపిస్తోంది. దీంతో గాలి పీల్చుకోవాలంటే కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరవుతున్నామన్నారు. ఇక్కడ నల్లటి పొగతో పాటు దుర్వాసన సైతం వస్తుంది. అధికారులు స్పందించి అక్రమంగా వెలుస్తున్న లెడ్డు బట్టీలపై చర్యలు తీసుకోవాలి. – మధు, జంగోనిగూడ

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి, లేమామిడి, కాకునూర్, కొండారెడ్డిపల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవంలో అంజయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండవర్గాల అభివృద్ధికి ఎన్నో సంక్షేమపథకాలు చేపడుతుందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. రైతుబంధు, రైతుబీమాతో రైతులను ఆదుకుంటుందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

పాపిరెడ్డిగూడ గ్రామంలో యువకులు వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు శ్రీశైలంగౌడ్, పార్వతమ్మ, లక్ష్మమ్మ, పల్లె స్వాతి బాలీశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, నర్సింలు, డీఈ యాదయ్యగౌడ్, ఎడీ రవీందర్, ఎఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్



క్రీడా ప్రాంగణం ఏర్పాటునకు స్థల పరిశీలన చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: ప్రతినిత్యం క్రీడలను సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని ఇండోర్ మినీ స్టేడియంలో శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటుగా మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలతో క్రీడాకారుల్లో స్నేహపూరిత వాతావరణం నెలకొనడమే కాకుండా, గెలుపొటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈటగణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటినరేందర్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్లు చెట్లపావనినర్సింలు, ప్రేమలతయుగంధర్, జీటీ.శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, యుగంధర్, నర్సింలు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ శ్రీలత అన్నారు. మండలంలోని సిద్ధాపూర్ పంచాయతీ చింతగట్టుతండా సమీపంలో శనివారం క్రీడా ప్రాంగణం ఏర్పాటునకు సర్పంచ్ తులశమ్మతో స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ, బాలయ్య, ఎంపీటీసీ ఢాకి, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



కేశంపేట: కళ్లకు గంతలు కట్టుకొని మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

కేశంపేట: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సత్యమ్మ, లలిత, సావిత్రి, వెంకటమ్మ, అక్కమ్మ, కళావతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎంపీడీఓ మహేష్‌బాబుకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వంట చేయడానికి ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుందన్నారు. వంటకు అవసరమైన నిత్యావసర సరుకులైన ఉప్పు, పప్పు, మంచి నూనె, గుడ్లకు గాను ఒక్కో విద్యార్థికి రూ.5:70పైసలు ఇవ్వడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి కార్మికులకు నెలకు రూ. 26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, చోటెమియా, రమేష్, రాధ, శశిధర్, బాబు, బుచ్చమ్మ, శేఖర్ గౌడ్, శశికళ, జహంగీర్, షరీఫా, మంజుల, యాదమ్మ పాల్గొన్నారు.



చేవెళ్లలో ఆశావర్కర్లకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. శనివారం సమ్మె చేస్తున్న ఆశావర్కర్లకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అనంత్‌రెడ్డి మాట్లాడుతూ కనీస వేతనం రూ.18,000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్‌రెడ్డి, అశోక్, శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రాగికోసం కేబుల్ వైర్లు, మోటర్లు అపహరణ

మొయినాబాద్‌రూరల్: కనకమామిడి గ్రామంలో వ్యవసాయ బావుల వద్ద కరెంటు మోటర్లు, కేబుల్ వైర్లు, బోరు మోటర్లు, ట్రాన్స్‌ఫారాలను పగులగొట్టి రాగి దొంగతనం చేస్తున్నారని రైతులు తెలిపారు. శుక్రవారం రాత్రి కనకమామిడి గ్రామానికి చెందిన పోలీస్ సంగారెడ్డి వ్యవసాయ బావి వద్ద 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి అందులోని రాగి వైర్లను దొంగలిస్తున్నారన్నారు. రెండు నెలల నుంచి ఇలా వరుస దొంగతనాలు జరుగుతున్నాయని గోవింద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, అంతిరెడ్డిగారి మోహన్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు. రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని వారు కోరారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిమామిడి శ్రీశైలంగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ నిర్వహించారు. భజనలు, భక్తి పాటలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఆలయ అర్చకులు రఘుపతిరావు పంతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి స్టీల్అండ్ సిమెంట్ దుకాణ యజమాని శివకుమార్ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, వసంత రావు, రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దత్తత



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పార్థసారథిశర్మ, స్వప్నఅంజయ్యగౌడ్

కెఎల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పార్థసారథివర్మ

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి కెఎల్ యూనివర్సిటీ కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి పార్థసారథివర్మ అన్నారు. శనివారం నక్కలపల్లిలో ఎన్ఎస్ఎస్ విభాగం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అజీజ్‌నగర్ సమీపంలో గల కెఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామాభివృద్ధి, గ్రామ దత్తత కార్యక్రమానికి సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, గ్రామస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్థసారథివర్మ మాట్లాడుతూ జాతీయ సేవలో భాగంగా కెఎల్ యూనివర్సిటీ క్యాంపస్ అధికారికంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటుందన్నారు. దాదాపు 200ల మందికి పైగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాధ్యతగా ఆయా పనులు నిర్వహించారన్నారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్, కోఆర్డినేటర్ సాయిలక్ష్మణ్, జి.భవానీ, సుష్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లపై పెట్టిన కేసులను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎత్తి వేస్తామని పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్ హామీ ఇచ్చారు. ఆశవర్కర్లు చేపట్టిన సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హక్కులకోసం న్యాయపరంగా పోరాటం చేస్తున్న ఆశవర్కర్లపై ప్రభుత్వం కేసులు పెట్టడం బాధాకరమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం దిగి రావాలన్నారు.

కేశంపేట: కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ రాములు, వార్డు సభ్యులు విష్ణు, మమత శ్రీను, శంకరయ్య, హనుమమ్మ, సురేందర్‌తో పాటు మాజీ సర్పంచ్ కృష్ణవేణి పలువురు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వీర్లపల్లి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, రూప్లానాయక్, శ్రీనాథ్, రమేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్

సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సాయిప్రసాద్‌యాదవ్ బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగను దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఎంతో ఘనంగా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేష్‌పూజారి, వార్డు సభ్యురాలు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, అంగన్‌వాడీ టీచర్లు శారదమ్మ, రోజా, రంగమ్మ, వీఓఏ సుమిత్ర, వెంకటమ్మ, మాణెమ్మ, సాయమ్మ, లలిత, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: మహిళల ఆత్మగౌరవం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టడమే కాకుండా దసరా కానుకగా బతుకమ్మ చీరలను అందజేస్తుందని సర్పంచ్ మామిళ్ల సంతోష అన్నారు. చేగూరులో శనివారం బతుకమ్మ చీరలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష మాట్లాడుతూ బతుకమ్మ సందర్భంగా పేద మహిళలు నూతన వస్త్రాలను ధరించాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ చీరలను అందజేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజమ్మ, వార్డు సభ్యులు శివ, యాదయ్య, రేషన్ డీలర్ శ్రీనివాస్, దశరత్, మల్లయ్య, గ్రామ కార్యదర్శి వీణా తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: సీఎం కేసీఆర్ ఆడపడుచులకు బతుకమ్మ చీరలను అందిస్తున్నారని ఆయా గ్రామాల సర్పంచులు అన్నారు. ఎల్కాగూడ, శ్రీరామ్‌నగర్ గ్రామాల్లో సర్పంచులు ఆలూరి కుమార్, ప్రభాకర్‌రెడ్డిలు చీరలు పంపిణీ చేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు, మహిళలకు అండగా నిలబడుతుందన్నారు. ఉప సర్పంచ్‌లు మెకిల వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, చంద్రయ్య, కార్యదర్శి సంజనశ్రీ, వీఓ పద్మ, తదితరులు పాల్గొన్నారు.



చేగూరులో చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మామిళ్ల సంతోష



షాద్‌నగర్‌రూరల్: చీరలు పంపిణీ చేస్తున్న సాయిప్రసాద్‌యాదవ్